క్లుప్తంగా

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్న సమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. శ్రీ శుభప్రద హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో అమ్మవారి ఆలయంలో సుమారు 300 మందికి అన్నసమారాధన చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు, గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం పర్యవేక్షణలో ఆలయ కార్యదర్శి బొడ్డు పోలారావు, గణేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొని అన్నసమారాధనలో సేవలు అందజేశారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



విశాలాక్షినగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో పారిశుధ్య విభాగం అధికారులు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం ప్రాంతాల్లో స్థానికులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరుచేసి వేర్వేరు డబ్బాల్లో వేయాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు సూచించారు. ఆ చెత్తను ప్రతి రోజు వీధుల్లోకి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వీధుల్లో చెత్త వేయవద్దని ప్రజలకు తెలియజేశారు. ప్రతి బుధవారం సాయంత్రం పార్కులను శుభ్రం చేస్తున్నామన్నారు. పార్కులకు వెళ్లేవారు వేస్టేజీని ఎక్కడబడితే అక్కడ కాకుండా డస్ట్ బిన్లలో వేయాలని, పార్కులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం రేపు

సీతంపేట: టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శిష్టకరణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించే కార్యక్రమం ఈ నెల 31న ప్రేమ సమాజంలో నిర్వహించనున్నారు. ప్రతిభా పురస్కారాలు అందుకోనున్న విద్యార్థుల జాబితాను విశ్వభారత్ చైర్మన్ బలివాడ రమేష్ పట్నాయక్ చేతుల మీదుగా గురువారం అక్కయ్యపాలెంలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిష్టకరణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో చిరు సత్కారం చేస్తూ వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు పట్నాయక్, వ్యవస్థాపక అధ్యక్షుడు మానాపురం సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలలా అన్ని జిల్లాల నుంచి టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 100 మంది విద్యార్థులకు శిష్టకరణం యువత ప్రతిభా పురస్కారాల పేరిట అవార్డులు అందజేస్తున్నట్టు తెలిపారు.

సర్వేలతో సతమతం



కంప్యూటర్లు పని చేయకపోవడంతో సర్వే వివరాలు నోట్‌బుక్‌లో నమోదు చేస్తున్న సెక్రటరీలు

- వివిధ యాప్‌లతో అల్లాడుతున్న సచివాలయ కార్యదర్శులు
- టార్గెట్లు ఇచ్చి భయపెడుతున్న అధికారులు
- పూర్తి చేయకపోతే నోటీసులు, మెమోలు జారీ

జగదాంబ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళకళలాడిన గ్రామ సచివాలయాలు నేడు కళావిహీనంగా మారిపోయాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సంక్షేమ పథకాలు దేవుడెరుగు కనీసం రేషన్, ఆధార్ కార్డుల వంటి పనులు కూడా అవడం లేదని మండిపడుతున్నారు. రేషన్, ఆధార్ కార్డుల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని దుయ్యబడుతున్నారు. కొత్త రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల్లో తప్పొప్పులు, చిరునామా మార్పుల కోసం ఇచ్చిన గడువు పూర్తి కావస్తున్నా, సర్వర్లు పని చేయకపోవడం, సచివాలయాల్లో స్టేషనరీ లేకపోవడం, కంప్యూటర్లు మొరాయించడం వంటి కారణాలతో పదేపదే తిరగాల్సి వస్తుందని ప్రజలు లబోదిబోమంటున్నారు. జోనల్ పరిధిలో ఉన్న 64 సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శులకు సర్వేల భారం..

సచివాలయాల్లో సెక్రటరీలు సర్వేలతో సతమతమవుతున్నారు. ఒకటా రెండా.. జియో హౌస్ హోల్డ్ సర్వే, కోఆర్డినేట్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే వంటి వాటితో సెక్రటరీలు ఇల్లిల్లూ తిరుగుతున్నారు. ఇంట్లో ఎవరు వర్క్ చేస్తున్నారు.. చేద్దామని ఎవరు అనుకుంటున్నారు వంటి వివరాలు యాప్‌లో నమోదు చేయాలి. అలాగే మనమిత్ర సర్వే, వాట్సాప్ గవర్నమెంట్ కోసం ఇంటింటి సర్వే, వెహికల్ ఆధార్ సీడింగ్ సర్వే, చిల్డ్రన్ ఆధార్ కార్డు సర్వే, నాన్ రెసిడెంట్ ఏపీ అప్‌డేట్, ఈ-కెవైసీ, ఎంఎస్ఎంఈ సర్వే, స్ట్రీట్ వెండర్ సర్వే, యోగా డే సర్వే వంటి లెక్కలేనన్ని సర్వేలతో సెక్రటరీలు ఊపిరి సలపనంత బిజీగా ఉంటున్నారు. ఈ సర్వేలన్నింట్లోనూ లబ్ధిదారుల నుంచి ఓటీపీలు తీసుకుని నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే బయోమెట్రిక్ ప్రెసెన్స్ కూడా చేయాలి. ఈ పనుల్లో టార్గెట్లు కూడా ఉన్నాయి. పూర్తి చేయకపోతే నోటీసులు, చార్జి మెమోలు తప్పడంలేదు. మరీ అధికారుల కోపం చల్లారకపోతే ప్రమాదాలు జరిగినా, ఇంట్లో తల్లిదండ్రుల ఆరోగ్యం బాగోకపోయినా, పెళ్లిళ్లు ఉన్నా సెలవులు ఇవ్వకపోవడం వంటి పనులతో ఇబ్బందులు పెడుతున్నారు. ఇంతటి ఒత్తిడి తట్టుకోలేని కొందరు సెక్రటరీలు హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు విడిచిన సందర్భాలు ఉన్నాయి.



సచివాలయంలో రేషన్‌కార్డులు అప్‌లోడ్ చేస్తున్న సెక్రటరీ

అందరికీ పీడీఎఫ్‌లే..

తాజాగా చాలా సచివాలయాల్లో ప్రజల పనులకు సంబంధించి పత్రాలు ఇవ్వడం లేదు. పీడీఎఫ్‌లు లబ్ధిదారుల సెల్‌ఫోన్లకు పంపుతున్నారు. వారినే బయట జిరాక్స్ సెంటర్లలో ప్రింట్ తీయించుకోమంటున్నారు. స్టేషనరీ లేదనో.. ప్రింటర్లు మొరాయిస్తున్నాయనో చెబుతున్నారు. చేసేది లేక లబ్ధిదారులు అలాగే చేస్తున్నారు.



ఉడ్‌యార్డ్, వెలంపేట సచివాలయం

కార్యకర్త కుమార్తె ఫీజుకు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం పార్టీ కార్యకర్త కుమార్తె ఫీజుకు రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్ట సమీపాన వాసుపల్లి కార్యాలయంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి సమక్షంలో ఆ వార్డు బూత్ ప్రెసిడెంట్ అంబటి అప్పలరాజు కుమార్తె స్రవంతి ఇంటర్‌లో చేరేందుకు సొంత నిధుల నుంచి ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించారన్నారు. ఈ రెండు కల్పిస్తే ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవుతారని, తద్వారా రాష్ట్రాభివృద్ధి సాధించవచ్చన్నారు. కానీ ముఖ్యమంత్రిగా అందలమెక్కిన చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేస్తే, వారి తిరుగుబాటును కూటమి తట్టుకోలేదని హెచ్చరించారు. మహిళలకిచ్చిన హామీలు, సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేకపోతున్న చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి వదిలి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతున్న నారా లోకేష్‌ను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ వర్గంపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. ఏడాది కూటమి పాలనలో ప్రజలు విసిగిపోయారని, వచ్చే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తారని వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల రవీంద్ర భరత్, లండా రమణ, లింగం శ్రీను, కాకి పద్మ, అలపన కనకరెడ్డి, ముజీబ్‌ఖాన్, దళమంతుల చిన్ని, దూడ అప్పారావు, సూరాడ లక్ష్మణరావు, వాసుపల్లి రాజు, చింతకాయల వాసు, రామరాజు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

సక్రమంగా పని చేయకపోతే కఠిన చర్యలు



చినవాల్తేరు యూపీహెచ్‌సీలో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆరోగ్య కార్యక్రమాల ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం చినవాల్తేర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) సందర్శించారు. అక్కడ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆరోగ్య కార్యక్రమాల గురించి వివరించారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో అన్ని ఆరోగ్య ఇండికేటర్లు తక్కువగా ఉండటంతో సిబ్బందికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు సాయంత్రం 4 గంటల వరకు క్షేత్ర సందర్శనలో ఉండి అభ ఐడీ నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే చేయాలన్నారు. జూన్ 15 లోపు శత శాతం సాధించాలన్నారు. ఆశ కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వర్తించనట్లయితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ ఉండగా మధ్యాహ్నం 12.30 గంటలకే ఆశ కార్యకర్తలు కనిపించడం లేదన్నారు. వీరిచేత తక్షణమే డ్యూటీ చార్ట్ ప్రకారం పని చేయించుకోవాలని, ఈ బాధ్యతలను కేంద్రం వైద్యులు పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్శనలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, డాక్టర్ బి.హారిక, ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల గుర్తింపునకు 'సహిత విద్య' సర్వే



ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్‌పీ సూర్యనారాయణ

పెదగంట్యాడ: దివ్యాంగులైన చిన్నారులను గుర్తించేందుకు సహిత విద్య ఐఈఆర్‌పీ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) బృందాలు సర్వేను ప్రారంభించాయి. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా, వారి శారీరక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సర్వే చేపడుతున్నారు. ప్రతి మండలంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల పరిధిలో ఈ గుర్తింపు కార్యక్రమం జరుగుతోంది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మిగిలిన పిల్లలతో సమానంగా అన్ని అవకాశాలూ కల్పించేందుకు ఈ భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వారికి సహిత విద్యను అందించడంతో పాటు, అవసరమైన ఉపకరణాలను కూడా అందిస్తున్నారు. సమాజంలో ఇంకా గుర్తించబడని ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడానికి భవిత కేంద్రాల ఐఈఆర్‌పీలు ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. 'ఇంక్లూజన్-2025' లో భాగంగా దివ్యాంగులందరికీ అవసరమైన విద్యను అందించడం, ప్రతి చిన్నారిని వారి వయసుకు తగ్గట్టుగా పాఠశాలల్లో చేర్పడమే ఈ సర్వే ప్రధాన లక్ష్యం. ఈ సర్వేలో భాగంగా విద్యార్థి దశలో ఉన్న మానసిక దివ్యాంగులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు, ప్రతివారం ఫిజియోథెరపీ సేవలను కూడా అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం, వారిని పాఠశాలలకు రప్పించేలా చర్యలు తీసుకోవడం వంటివి ఈ సర్వేలో ముఖ్యమైన అంశాలు. ఈ ప్రత్యేక సర్వే మే 13వ తేదీ నుంచి ప్రారంభమైంది.

ముగిసిన యోగా పోటీలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన యోగాసనాల పోటీలు గురువారం ముగిశాయి. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ ప్రతిభ, ఫిజికల్ డైరెక్టర్ చిల్ల వెంకటరెడ్డి, సీఆర్ఎంటీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. బుధవారం జరిగిన సూర్య నమస్కార్, మెడిటేషన్ పోటీలలో సుష్మిత ప్రియాంక, ఎస్.కనకమ్మ, ఎస్.నూకరత్నం.. జూనియర్స్ విభాగంలో డ్రాయింగ్, సింక్రనైజ్‌డ్ యోగా పోటీలలో టి.హర్షిణి, పి.కావ్యశ్రీ, టి.లాస్య బహుమతులు గెలుచుకున్నారు. యూత్ విభాగంలో ఎస్.కనకమ్మ, పి.లక్ష్మి, బి.సత్యవతి, సీనియర్స్ విభాగంలో ఎల్.సూర్యనారాయణ, యూవీ రమణమ్మ, బి.వరలక్ష్మి వరుసగా బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నమ్మి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు కానూరి భాస్కరరావు, పక్కి నాగేశ్వరరావు, కె.జగన్నాథం, పి.జయంత్‌కుమార్, రాంప్రసాద్, ఆనంద్, ఎస్ఎస్ఏ పీఈటీలు మేరీ గోల్డ్, పద్మావతి, అనురాధ, నూకరత్నం, రాజు పర్యవేక్షించారు.

ఘనంగా అమ్మవార్ల ఉత్సవాలు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు



విశేష అలంకరణలో బంగారుమాంబ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులోని నాతయ్యపాలెం గ్రామ దేవతలైన బంగారుమాంబ, నూకాంబిక అమ్మవార్ల పండగలు ఈ నెల 21 నుంచి గురువారం వరకు అంగరంగ వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు సాగిన ఈ వేడుకలు గ్రామ ప్రజల భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా పూర్తయ్యాయి. మే 21న చాటింపుతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రతీ రోజు ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఈనెల 25న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. 27న నూకాంబిక అమ్మవారి మహోత్సవం ఘనంగా జరిగింది. చివరిరోజు గురువారం మధ్యాహ్నం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి గ్రామస్తులు సత్తెమ్మ తల్లికి కర్రల రక్షణలో బంగారుమాంబ ఆలయం వద్దకు నైవేద్యాన్ని తీసుకెళ్లారు. అమ్మవారికి పట్టాపోతును సమర్పించిన అనంతరం సాయంత్రం సాముగరిడి, తప్పెటగుళ్లు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్చుతూ అనుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశేష అలంకరణలో బంగారుమాంబ అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. ఈ తొమ్మిది రోజుల ఉత్సవాలకు ఆలయ కమిటీ ప్రతినిధులు గోపిశెట్టి శ్రీనివాసరావు, పల్లేల శ్రీనివాసరావు, గవర వెంకట రమణారావు, గండ్రెడ్డి ప్రకాశరావు, సంద్రాన శ్రీనివాసరావు, గోపిశెట్టి వెంకటరావు, సంద్రాన కిషోర్, గోపిశెట్టి సోమునాయుడు, కసుమరెడ్డి శ్రీనివాసరావు పూజా ఏర్పాట్లతో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై పెరిగిన దాడులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని, ఇటీవలే తెనాలిలో ఇద్దరు దళితులు, ఒక ముస్లింపై నడిరోడ్డుపై పోలీసులు జరిపిన దమనకాండే ఇందుకు నిదర్శనమని భారత్ సమాజ్ డెవలప్ పార్టీ అధ్యక్షుడు చింతాడ సూర్యం తెలిపారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు ఇంత దారుణంగా లాఠీలతో కొట్టడం రాజ్యాంగంలో ఉందా? అని ప్రశ్నించారు. దళితులపై దాడి చేసిన పోలీసులపై తగు చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. హోం మినిస్టర్ దళితవర్గానికి చెందిన వారై ఉండి.. దళితులపై ఇలా దాడులు జరుగుతుంటే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. నీ జాతి బిడ్డలను ఇలా కొట్టడం తగదన్నారు. ఈ ఘటన జనసేన పార్టీ నాయకుడు.. మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలో జరిగిందని, మీరు వెంటనే సీఐ రాములు, ఎస్ఐ రమేష్ బాబును అరెస్టు చేసి, వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గం మల్లాంలో దళితుల్ని గ్రామ బహిష్కరణ చేశారని, అక్కడ కూడా దళితులను అవమానపరిచారని, అటువంటి వారిని శిక్షించకుండా అగ్రవర్ణాలు కాపాడుతున్నారని ఆరోపించారు. అలాగే తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ వారిపై తిరుచానూరు పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేశారన్నారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దప్పలంపాడు దళితులపై దాడి చేయడమే కాకుండా, సామాజిక బహిష్కరణ చేసిన టీడీపీ పెత్తందార్లపై కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. అలాగే పాయకరావుపేట డెంకాడ గ్రామంలో 8 మంది దళితులను అర్ధరాత్రి కర్రలతో దాడి చేసిన వారిని ఇంకా అరెస్టు చేయలేదన్నారు. వారికి డీఎస్పీ.. టీడీపీ నాయకులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దళితులను ఉద్ధరిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దళితులపై దారుణంగా వ్యవహరిస్తోందని, హోం మినిస్టర్ వెంటనే కలుగజేసుకుని ఇటీవల జరిగిన ఘటనలపై స్పందించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- మేహాద్రి, ఇతర ప్రాంతాల్లో నిఘా
- పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ హెచ్చరిక



సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌తో పాటు ఇతర బహిరంగ ప్రాంతాల్లో మద్యం పార్టీలు, జూదం తదితర చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ మేహాద్రి, నల్లక్వారీ ప్రాంతాల్లో పార్టీలు చేసుకుని ఈతకు దిగి మృత్యువాత పడడం విషాదకరమన్నారు. ఇకపై ఆయా ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా చెక్ పెడతామని తెలిపారు. అవసరమైన చోట డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ దేవతల పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా పూర్తిగా నిషిద్ధమని పేర్కొన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఐపీఎల్‌లో తుది మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

50 రోజులు నిర్విరామంగా చలివేంద్రం సేవలు



విద్యార్థినులకు మజ్జిగ అందజేస్తున్న సుంకరి రాజేంద్ర

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఆళ్వార్‌దాస్ సర్కిల్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రం సేవలు 50 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగాయి. ఆళ్వార్‌దాస్ గ్రూప్‌నకు చెందిన వీఎంసీ డిగ్రీ, ఏఎస్ రాజా జూనియర్ కళాశాలలు సంయుక్తంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గురువారంతో ఈ కార్యక్రమానికి 50 రోజులు పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు 1,200 మందికి చల్లని తాగునీరు, మజ్జిగ అందించినట్లు చెప్పారు. ఈ సేవలు మరికొన్ని రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈ కళాశాలల కార్యదర్శి సుంకరి రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్‌లు పాల్గొని చలివేంద్రంలో పలువురు బాటసారులు, విద్యార్థినులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ



ప్రయాణికురాలు పోగొట్టుకున్న ఫోన్‌ను ఆమెకు అందజేస్తున్న స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్ తదితరులు

డాబాగార్డెన్స్: ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. ప్రయాణికురాలు తన ఫోన్‌ను బస్సులో మరచిపోయి స్టేషన్ వచ్చిందని ఆతృతతో దిగిపోయారు. బస్సు గమ్యస్థానం చేరుకున్నాక ఆ డ్రైవర్‌కు సీట్లో సెల్‌ఫోన్ దొరకడంతో సెక్యూరిటీ సిబ్బందికి అప్పజెప్పాడు. వివరాల్లోకి వెళ్తే.. పి.సునీత తన భర్త అప్పన్నతో కలిసి గురువారం ఉదయం 7 గంటలకు శ్రీకాకుళం డిపోకి చెందిన పల్లె వెలుగు బస్సులో విశాఖ వచ్చేందుకు భోగాపురంలో బస్సు ఎక్కారు. మధురవాడ వచ్చేసరికి ఆతృతగా బస్సు దిగిపోయారు. ఆ సమయంలో ఫోన్ మరిచిపోయారు. బస్సు డ్రైవర్ గమ్యస్థానం (విశాఖపట్నం) చేరుకున్నప్పుడు బస్సును పరిశీలించాడు. ఓ సీట్లో సెల్‌ఫోన్‌ను గుర్తించి, సెక్యూరిటీ సిబ్బందికి అందజేశాడు. ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణికురాలు సునీత డ్రైవర్‌కు ఫోన్ చేసింది. ఫోన్ ఉందని, సెక్యూరిటీ సిబ్బందికి అందజేసినట్లు తెలిపారు. మీరు ద్వారకా బస్‌స్టేషన్‌కు వెళ్లి స్టేషన్ మేనేజర్‌ను కలిసి వివరాలు తెలిపితే మీ ఫోన్ అందజేస్తారని చెప్పాడు. ఆమె ద్వారకా బస్‌స్టేషన్‌కు వచ్చి ఫోన్ పోయినట్టు లేఖ రాసి స్టేషన్ మేనేజర్‌కు అందజేసింది. సెక్యూరిటీ సమక్షంలో స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్ ఫోన్ పోగొట్టుకున్న సునీతకు దాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ ఎంవీడీ ప్రసాద్, సిబ్బంది పంపాన వెంకటేశ్వరరావు, ఎం. అమల పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ సెల్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

సీతంపేట: హ్యూమన్ రైట్స్ సెల్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అక్కయ్యపాలెం జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎం.ఎస్.వి.విశ్వనాథం నియమితులయ్యారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు వి.రామకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.పి.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.రాజా చేతుల మీదుగా గురువారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడిగా వి.చంద్రమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.ఎస్.ఎన్.రాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.దొరబాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా దీనాకుమారి, జాయింట్ సెక్రటరీలుగా కుప్పిలి గోవింద్ పట్నాయక్, ఎస్.కుష్యంత్, కోశాధికారిగా పి.సత్యనారాయణ రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం చేత జె.ఎం.నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లకు సర్టిఫికెట్లు

మధురవాడ: క్రమశిక్షణ, విలువలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు ప్రతీకలని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రవి అన్నారు. వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాష్ట్రస్థాయిలో శిక్షణ పూర్తి చేసుకున్న ఉత్తమ విద్యార్థులకు తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లు అందించారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ రాజ్య పురస్కార్ సాధించిన విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్యాభ్యాసం, ఉద్యోగ సాధనలోనూ ప్రాధాన్యం లభిస్తుందన్నారు. స్కౌట్స్ జిల్లా కార్యదర్శి డి.వేణుగోపాల్ మాట్లాడుతూ రాజ్య పురస్కార్ అనంతరం ఒక సంవత్సరం శిక్షణ పొందితే రాష్ట్రపతి జారీ చేసే సర్టిఫికెట్ పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా కమిషనర్ ఆర్.మధుసూదనరావు, రాష్ట్ర సహాయ కమిషనర్ అహమ్మద్ షరీఫ్, గైడ్స్ కెప్టెన్ జి.ఉషారాణి, కె.ఎల్.ప్రసన్న కుమార్, స్కౌట్స్ మాస్టర్ ఎస్. సోమేష్ తదితరులు పాల్గొన్నారు.